క్లుప్తంగా

విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: టీఎస్ఎస్ పీడీసీఎల్ 11 కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏడీఈ విజయ్ భాస్కర్ తెలిపారు. అంబర్‌పేట్ ఫీడర్ పరిధిలో అంబర్‌పేట, ఎంసీహెచ్ కాలనీ, ఆకాష్‌నగర్, రెడ్‌బిల్డింగ్, రామకృష్ణనగర్, వినాయక్‌నగర్ తదితర ప్రాంతాల్లో 9.30 నుంచి 11.30 వరకు, ప్లేగ్రౌండ్ ఫీడర్ పరిధిలో బుర్జుగల్లీ, కుమ్మరివాడి, ఎరుకలబస్తీ, గాంధీబొమ్మ, వాణి ఫోటోస్టూడియో తదితర ప్రాంతాల్లో 11.30 నుంచి 1.30వరకు, గోల్నాక ఫీడర్ పరిధిలో జైస్వాల్ గార్డెన్, మారుతీనగర్, తిరుమల్‌నగర్, తిలక్‌నగర్ ఫీడర్ పరిధిలో 6నంబర్ క్రాస్‌రోడ్స్, అంబర్‌పేట్ మెయిన్‌రోడ్డు, 6 నంబర్ ఫీడర్ పరిధిలో గోల్నాక చర్చ్, అశోక్‌నగర్, తిలక్‌నగర్, వెజిటెబుల్‌మార్కెట్ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి సాయంత్రం 5 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: మోదీ యువకేంద్ర ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ టీచింగ్ శిక్షణ కోర్సుల్లో (రెగ్యులర్, కరస్పాండెంట్) చేరేందుకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నామని సెంటర్ డైరెక్టర్ కొంగర శ్రీనివాస్ ప్రకటించారు. చైల్డ్ సైకాలజీ, టీచింగ్ మెథడ్స్, చైల్డ్ హెల్త్‌కేర్, స్కూల్ అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్, స్కిల్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, ప్రాక్టికల్ అంశాల్లో 45 రోజుల పాటు క్రాష్ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అభ్యర్థులకు ఫీజుల్లో రాయితీ ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 5 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీనికి ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హత కలిగిన వారు వివరాలకు 9000200582 నంబరును సంప్రదించాలన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎంపీ అంజన్ కుమార్‌యాదవ్

ముషీరాబాద్: సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సోషల్‌వర్కర్ సయ్యద్ జాఫర్ హుస్సేన్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న సికింద్రాబాద్ మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్, రాంనగర్ మాజీ కార్పొరేటర్ కల్పనాయాదవ్, పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు ఆయన భౌతికకాయానికి నివాళి అర్పించి కుటుంబ సభ్యులు, కుమారుడు తాహెర్ హుస్సేన్‌ను పరామర్శించారు. అమ్జద్ హుస్సేన్, జోహెర్‌హుస్సేన్, మీర్ హుస్సేన్, కృష్ణవేణి తదితరులురు.

డైరీ ఆవిష్కరణ



సుందరయ్యవిజ్ఞానకేంద్రం: రాష్ట్ర మాదిగ సంక్షేమ సంఘం 2023 డైరీని సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండా శ్రీనివాస్‌లు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ దళితుల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారన్నారు. దళితులను అభివృద్ధి చేసేందుకు దళిత బంధు తీసుకొచ్చారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షుడు యాదయ్య, డాక్టర్ శ్రీనివాస్, టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మోజెస్, ప్రభాకర్, నరేష్, సంపూర్ణ, సరస్వతి, రాములు, శేఖర్, మహేందర్ తదితరులున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

కాచిగూడ: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలైన ఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై ఎస్.నాగరాణి తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక డివిజన్, నెహ్రూనగర్ ప్రాంతానికి చెందిన దేవాస్వామి కుమారుడు హరిష్ (56) కూలి పనిచేస్తుంటాడు. మంగళవారం రాత్రి విధులు ముగించుకుని కాచిగూడ, లింగంపల్లి నుంచి ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా.. అదే సమయంలో గుర్తు తెలియని ద్విచక్ర వాహనం అతడిని ఢీకొట్టడంతో కుడి, ఎడమ కాలుకు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో బాధితుడు కాచిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెనుకబడ్డ బీసీ సంచార జాతులు

కాచిగూడ: బీసీ (ఏ) గ్రూపులో మొత్తం 56 కులాలు ఉండగా.. అందులో 35 కులాలు అత్యంత వెనుకబడిన సంచార జాతులు ఉన్నాయని తెలంగాణ సంచార జాతుల సంక్షేమ సమితి అధ్యక్షుడు అబ్బులింగం అన్నారు. 35 కులాల వారికి రిజర్వేషన్‌లు దక్కక నేటికి ఆర్థిక, విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బీసీ కులాలను ఎక్కువ గ్రూపులుగా విభజించి సంచారజాతులకు రిజర్వేషన్ ఫలాలు అందించాలని ఆయన స్పష్టం చేశారు.

నిజాయితీగా పనిచేసే వారిని గౌరవిస్తాం



అవార్డుల ప్రదానోత్సవంలో మాట్లాడుతున్న ఎండీ సజ్జనార్



ఆర్టీసీ కార్మికులకు అవార్డులను ప్రదానం చేస్తున్న ఆర్టీసీ ఎండీ సజ్జనార్

ఆర్టీసీ ఎండీ సజ్జనార్

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: నిజాయితీగా పనిచేసే సిబ్బందిని గుర్తించి గౌరవించడం జరుగుతుందని తెలంగాణ ఆర్టీసీ ఎండీ వీ.సీ సజ్జనార్ అన్నారు. బుధవారం ఆర్టీసీ కల్యాణ మండపంలో రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఎక్స్‌ట్రా మైలేజ్ అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా ఎండీ పాల్గొని పలువురు ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్లకు అవార్డులను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 30 లక్షల మంది ప్రయాణికులను గమ్య స్థానానికి చేరుస్తూ మెరుగైన సేవలు అందిస్తున్నామన్నారు. కొన్ని కారణాల వల్ల తమ విలువైన వస్తువులను పోగొట్టుకుని ప్రాణాపాయస్థితిలో కొట్టుమిట్టాడుతూ.. ఆపదలో ఉన్న ప్రయాణికులకు సేవలను అందిస్తున్న తమ ఆర్టీసీ సిబ్బంది అభినందనీయులని వారికి తగిన గుర్తింపు గౌరవాన్ని ఇస్తామన్నారు. తమ సిబ్బంది నిజాయితీగా పనిచేస్తారని చెప్పేందుకు ఈ అవార్డులే నిదర్శనం అన్నారు. ఈడీలు మునిశేఖర్, యాదగిరి, ఫైనాన్షియల్ ఆఫీసర్ కృష్ణకుమారి, చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ డాక్టర్ రవిందర్ తదితరులున్నారు.

పత్తి ధరను తగ్గించిన వారిపై చర్యలు తీసుకోవాలి



మంత్రి నిరంజన్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: వ్యాపార వర్గాలు సిండికేట్ అవతారం ఎత్తి పత్తి ధరను తగ్గించారని వారిపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్, ప్రధానకార్యదర్శి ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని కలిసి ఆయనకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. రాష్ట్రంలో గతేడాది పత్తి ధర క్వింటాల్‌కు రూ.14వేల నుంచి రూ.15వేల వరకు ఉందని ఈ ధర వారం పదిరోజులు కూడా లేకుండానే వ్యాపార వర్గాలు సిండికేట్ అవతారం ఎత్తి కృత్రిమంగా రూ.8 వేల నుంచి రూ.9 వేలకు తగ్గించారని ఆరోపించారు. ప్రస్తుతం ఈ ధర రూ.6 వేల నుంచి రూ.7 వేల వరకు మాత్రమే ఉందన్నారు. ఈ వ్యవహారం మా దృష్టికి కూడా వచ్చిందని దీనిపై విచారించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చినట్లు సమాచారం. రైతు సంఘం నాయకులు కె. రంగయ్య, దాసన్న తదితరులున్నారు.

గౌడలను అభివృద్ధి చేసేందుకు కృషి



మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: గౌడలను అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ స్పష్టం చేసినట్లు తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలరాజుగౌడ్ అన్నారు. బుధవారం ఆయన మంత్రిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ కార్యాలయంలో మాట్లాడారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం తమ ప్రభుత్వం కృషి చేస్తోందని దీనిలో భాగంగానే గౌడలకు తగిన గుర్తింపు, ప్రాధాన్యతను ఇస్తున్నామన్నారు. సమన్వయ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్‌కుమార్‌గౌడ్, కన్వీనర్ వెంకన్నగౌడ్, వైస్ చైర్మన్ విజయ్‌కుమార్‌గౌడ్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ దామోదర్‌గౌడ్, రాజుగౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు

చిక్కడపల్లి: పేద మధ్యతరగతి ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఓ వరమని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. బుధవారం ఆయన గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 24 మంది లబ్ధిదారులకు రూ.10,26000ల చెక్కులను అందజేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ నరేష్, బీఆర్ఎస్ నాయకులు రాకేష్‌కుమార్, రవిశంకర్‌గుప్తా, శంకర్‌ముదిరాజ్, పీఎస్ శ్రీనివాస్, ఆకుల శ్రీనివాస్, బత్తుల కిరణ్‌కుమార్, సీహెచ్ హన్మంతు, శ్రీధర్‌రెడ్డి, విఠల్, భాస్కర్‌రెడ్డి, వెంకటేష్, జహంగీర్, సురేష్, ఆనంద్ తదితరులున్నారు.

కాచిగూడ: అనారోగ్యంతో బోజరాజు, వెంకటమ్మల కుమార్తె అనుషా (13) అనారోగ్యంతో ఇటీవల ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఆసుపత్రి ఖర్చుల కోసం ఆర్థిక సహాయానికి బీఆర్ఎస్ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు శ్రీశైలం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ సునిత ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకోగా.. రూ.2 లక్షల చెక్కును బుధవారం వారికి ఎమ్మెల్యే అందజేశారు. కుమ్మరికుంట రవీందర్, ఎండీ హమీద్ తదితరులున్నారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు



ట్రాఫిక్ సీటీ-2 డీసీపీ కరుణాకర్, కాచిగూడ ఏసీపీ సంపత్, నల్లకుంట సీఐ రామకృష్ణ

ముషీరాబాద్: విద్యానగర్‌లోని స్పెన్సర్ చౌరస్తాలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని ట్రాఫిక్ సిటీ -2 డీసీపీ కరుణాకర్ తెలిపారు. స్పెన్సర్ చౌరస్తాలో జంక్షన్ చిన్నగా ఉండడం వల్ల తరుచూ ట్రాఫిక్ జామ్ కలుగుతుందన్నారు. లక్కీ చౌరస్తా నుంచి అడిక్‌మెట్ వైపు రోడ్డు డివైడర్ ఏర్పాటు చేపట్టాలని కోరుతూ.. అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ ఉపాధ్యక్షుడు విశ్వనాథ్‌శాస్త్రి, విద్యానగర్ కాలనీవాసులు ఇటీవల కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు.

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి డీసీపీని ఆదేశించడంతో బుధవారం కాచిగూడ ట్రాఫిక్ ఏసీపీ సంపత్, నల్లకుంట ట్రాఫిక్ సీఐ రామకృష్ణతో కలిసి విద్యానగర్ స్పెన్సర్ చౌరస్తాను డీసీపీ సందర్శించారు.
- ఈ చౌరస్తా నుంచి అచ్యుతరెడ్డి మార్గ్‌కు వెళ్లే వారి కోసం స్పెన్సర్ చౌరస్తాలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు వైపు రోడ్డును విస్తరిస్తామని అచ్యుతరెడ్డి మార్గ్ నుంచి అడిక్‌మెట్‌కు వెళ్లే వైపు స్పెన్సర్ వైపు రోడ్డును కూడా విస్తరణ చేస్తామన్నారు.
- రోడ్డుకు ఇరువైపుల ఫుట్‌పాత్ అక్రమాలపై చర్యలు తీసుకుంటామని డీసీపీ స్థానికులకు హామీ ఇచ్చారు. దీనిపై త్వరలో జీహెచ్ఎంసీ అధికారులతో సమీక్షించి చర్యలు చేపడతామన్నారు. కాలనీ వాసులు మురళీధర్‌రావు, చంద్రశేఖర్, వెంకటేష్, సత్యనారాయణ, పీ.ఎస్ శాస్త్రి, శేషగిరి, బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె. సురేందర్, రాంనగర్ రామాలయం చైర్మన్ రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్ పరీక్షలపై ఉచిత అవగాహన

చిక్కడపల్లి: ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని రాజ్ ఎడ్యుకేషనల్ హబ్ కోచింగ్ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 5 నుంచి 12 వరకు ఉచితంగా గ్రూప్స్ 2,3,4 పరీక్షలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ రాజు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల కోసం సన్నద్ధం అవుతున్న అభ్యర్థులకు ఉపయోగపడేలా ఈ సదస్సులు ఉంటాయన్నారు. ఆసక్తి కలిగిన వారు 7032782352 నంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఎమ్మెల్యేకు వినతి

చిక్కడపల్లి: సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించే స్టార్ యాక్టివిటీస్ అధినేత ఓరుగంటి రామకృష్ణ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. కాగా తనను ఆదుకోవాలని ప్రభుత్వం, ఎమ్మెల్యే ముఠాగోపాల్‌కు విజ్ఞప్తి చేశారు. అతడికి ఓ కాలు, చెయ్యి పనిచేయకుండా పోవడంతో అతడిని డీడీ కాలనీలోని సాయిబాబా ఆలయం సమీపంలోని ఓల్డేజ్ హోమ్‌లో చేర్చారు. ఆర్థికంగా చితికిపోయిన తనను ఆదుకోవాలని విన్నవించారు.

ఈ - శ్రమ్ అసంఘటిత కార్మికులకు వరం

చిక్కడపల్లి: అసంఘటిత కార్మికులంతా ఈ- శ్రమ్ పథకంలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని కార్మికశాఖ జంటనగరాల డిప్యూటీలేబర్ కమిషనర్ శ్యామ్‌సుందర్‌రాజు కోరారు. బుధవారం ఆయన ఆర్టీసీక్రాస్‌రోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అసంఘటితంగా కార్మికులంగా ఈ- శ్రమ్ పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. దీనిద్వారా కార్మికులకు రూ. 2లక్షల వరకు బీమా వర్తిస్తుందన్నారు. ప్రతీ అసంఘటిత కార్మికుడికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు ఇవ్వడం జరుగుతుందన్నారు. 16 నుంచి 59 ఏళ్లున్న వారు అర్హులని వివరించారు.

సోషలిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవం

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: మహాజన సోష లిస్టు పార్టీ (ఎం.ఎస్.పీ) పదో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బాగ్‌లింగంపల్లిలోని భగత్‌సింగ్‌నగర్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. అనగారిన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎంఎస్‌పీ జాతీయ నాయకులు కృష, రాజు, శివ, విజయరావు, సామెల్, విష్ణు తదితరులున్నారు.

వీధి దీపాల ఏర్పాటుకు కృషి

చిక్కడపల్లి: నూతన వీధి దీపాలను ఏర్పాట్లు చేస్తున్నట్లు గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ తెలిపారు. బుధవారం జీహెచ్ఎంసీ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్‌సీరెడ్డి స్టడీసర్కిల్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలో పలు కాలనీల్లో నూతన వీధి దీపాలను ఏర్పాటు చేయిస్తున్నట్లు వెల్లడించారు. సూపర్‌వైజర్ బాలునాయక్, షకీర్, బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఆనంద్, రాజు, ఉమేష్, నర్సింహ, సాయిసంతోష్ తదితరులున్నారు.

హుండీ లెక్కింపు

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని లక్ష్మీగణపతి దేవాలయం 4 నెలల హుండీ ఆదాయాన్ని ఆలయ సిబ్బంది లెక్కించగా రూ.4,25,833 వచ్చాయని ఈఓ లక్ష్మారెడ్డి ప్రకటించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్, ఆలయ చైర్మన్ ప్రభాకర్ దంపతులు, ఆలయ సిబ్బంది, రాజన్‌ముదిరాజ్, రాజు, ధర్మకర్తలు రమణమూర్తి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

అంబర్‌పేట: ఉపాధ్యాయురాలు గాజుల మంజులతకు కవి విపంచి అవార్డును ప్రదానం చేశారు. బాగ్ అంబర్‌పేట్ నారాయణ పాఠశాలలో ఇంగ్లిష్ బోధించే ఆమెకు సావిత్రిబాయి పూలే 192వ జయంతి సందర్భంగా ఈ అవార్డు దక్కిందన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవ చైర్మన్ గోపీ చేతుల మీదుగా అవార్డును అందుకున్నట్లు ఆమె తెలిపారు.

సంతాపం

కాచిగూడ: రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ తండ్రి గంగుల మల్లయ్య మరణం పట్ల రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యులు కిషోర్‌గౌడ్ ప్రకటనలో సంతాపం తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేసి ఆయన ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

సంగీత విభావరి

చిక్కడపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఐదు రోజులపాటు త్యాగరాయగానసభలో జరిగే సుశీల సంగీత విభావరి ప్రారంభమైంది. తొలి రోజు ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్వ ప్రధాన కార్యదర్శి ఎల్‌వీ సుబ్రహ్మణ్యం ప్రారంభించారు. తెలుగు యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య ఎన్. గోపి, డాక్టర్ చిత్తరంజన్, గానసభ అధ్యక్షులు కళా జనార్దనమూర్తి, ప్రముఖ గాయని మణిశాస్త్రి పాల్గొన్నారు. మద్దాళి రఘురామ్, రాధాకృష్ణ, సుబ్బారావు తదితరులున్నారు.

ఆధునిక వ్యవసాయంపై అవగాహన కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్. కృష్ణయ్య

ముషీరాబాద్: రైతాంగానికి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఎంపీ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. బుధవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో రైతులకు చేయూతనందించడమే లక్ష్యంగా ఏర్పాటైన కేతివాల్ అంకుర సంస్థ బ్రోచర్‌ను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. పేద రైతులకు భరోసా కల్పించేందుకు ఈ సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. దేశంలో 70 శాతం మంది వ్యవసాయంపై ఆధార పడుతున్నారని కేంద్రం తగిన చేయూతనందించలేకపోతుందని ఆరోపించారు. కేతివాలా సంస్థ ఫౌండర్ లక్ష్మణ్, సత్యనారాయణమూర్తి, తరుణ్, బీసీ సంక్షేమ సంఘం నేతలు కృష్ణ, సత్యం తదితరులు పాల్గొన్నారు.

సేవాభావాన్ని అలవర్చుకోవాలి : ఎమ్మెల్సీ కవిత



ఎమ్మెల్సీ కవిత, ఎమ్మెల్యే ముఠాగోపాల్‌తో డాక్టర్ విజయలక్ష్మి



కాచిగూడ: ప్రతి ఒక్కరూ సేవా భావాన్ని అలవర్చుకుని ఆపదలో ఉన్న పేదలు, సాయం కోసం వచ్చే విద్యార్థులకు, రోగులకు స్వచ్ఛందంగా సేవ చేసేందుకు ముందుకు రావాలని ఎమ్మెల్సీ కవిత అన్నారు. వాసవి బిజినెస్ గ్రూప్ (వీబీజీ) ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలు అందరికీ ఆదర్శనీయంగా ఉంటాయన్నారు. కరోనా కష్టకాలంలో వీబీజీ ప్రతినిధులు చేసిన సేవలు అందరికీ ఆదర్శనీయంగా ఉన్నాయన్నారు. దేశ భవిష్యత్తు విద్యార్థులపైనే ఆధారపడి ఉందని అలాంటి విద్యార్థులను సక్రమంగా పెంచి పోషించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన బీజేపీ నేత

ముషీరాబాద్: బీజేపీ నేత విజయలక్ష్మి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆమెను ఎమ్మెల్సీ కవిత పార్టీలోకి ఆహ్వానించారు. ఆమెతో పాటు బీజేపీ సీనియర్ నేత శ్రీనివాస్, పలువురు మహిళలు పార్టీలో చేరారు. అనంతరం టీఆర్ఎస్ సీనియర్ నాయకులు మాధవ్, శ్యామ్‌సుందర్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, ముఠా జైసింహా, ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు మాట్లాడారు. బీజేపీలో అంతర్గత సంక్షోభం చాలా ఉందని, పార్టీలో పనిచేస్తామని స్వచ్ఛందంగా వచ్చిన బాధ్యతలు అప్పగించకపోవడంతోనే తనను తీవ్ర నిరాశకు గురిచేసిందని విజయలక్ష్మి తెలిపారు.

పీటీ రెడ్డి గ్యాలరీని సందర్శించిన ఎమ్మెల్సీ కవిత

కాచిగూడ: రాష్ట్రం గర్వించదగ్గ చిత్రకారుడు పీ.టీ.రెడ్డి అని ఎమ్మెల్సీ కవిత కొనియాడారు. ఆయన జయంతి సందర్భంగా బుధవారం నారాయణగూడలోని పీ.టీ.రెడ్డి గ్యాలరీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పెయింటింగ్స్, స్కల్ప్చర్, ఆర్ట్‌వర్క్ ఎంతో అద్భుతంగా ఉన్నాయని ఈ కళను కాపాడుకుని కళనే తన జీవితంగా జీవించారన్నారు. టీఎస్ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్ సాగర్, శ్రీనివాస్ గుప్తా, వెంకటేశ్వర్‌రెడ్డి, బాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులున్నారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



ప్రేమ్‌నగర్‌లో పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

అంబర్‌పేట: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. బుధవారం డివిజన్‌లో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులు సకాలంలో పూర్తి చేసి స్థానికుల ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు ఆయన స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి జీహెచ్ఎంసీ అధికారులతో పాటు స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాల పంపిణీ



టీకాల పంపిణీలో కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: చిన్నారులకు రోగ నిరోధక శక్తి పెరిగేందుకు తల్లిదండ్రులు విధిగా టీకాలు వేయించాలని బాగ్అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి కోరారు. బుధవారం డివిజన్‌లోని తురాబ్‌నగర్‌లో చిన్నారులకు టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. బాగ్అంబర్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక వైద్యురాలు హర్షశ్రీ ఆధ్వర్యంలో చిన్నారులకు టీకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. చిన్నారులకు సరైన సమయంలో టీకాలు వేస్తేనే భవిష్యత్తులో వారు వ్యాధుల బారిన పడకుండా ఉంటారన్నారు. బీజేపీ నాయకులు వెంకట్‌రెడ్డి, జగన్, రమేష్, బాల్‌రాజ్ తదితరులున్నారు.

వ్యాక్సినేషన్ ప్రారంభం

ముషీరాబాద్: చిన్నారులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. ముషీరాబాద్ భోలక్‌పూర్ యూపీహెచ్‌సీలో బుధవారం 6 నెలలు నిండిన చిన్నారులకు మెదడువాపు, పోలియో నివారణకు టీకాలు వేసే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 9 నెలలు నిండిన ప్రతి చిన్నారికి ఈ వ్యాక్సిన్‌ను తల్లిదండ్రులు వేయించాలని సూచించారు.

రాంనగర్‌లో..

- అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నపిల్లలకు ఇచ్చే జేఈ వ్యాక్సినేషన్ బుధవారం ప్రారంభమైంది. రాంనగర్ డివిజన్ హరినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ రవిచారి ఈ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు.



వ్యాక్సిన్ వేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

పోలియో నివారణ వ్యాక్సిన్

కాచిగూడ: పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్ సూచించారు. బుధవారం డివిజన్‌లోని మోతిలాల్ నెహ్రూనగర్ బస్తీలోని పిల్లలకు మెదడువాపు, పోలియో నివారణపై అవగాహన నిర్వహించారు. 9 నెలల నుంచి 12 వరకు మొదటి డోస్, 16 నెలల నుంచి 24 నెలల వరకు 2వ డోస్ వ్యాక్సిన్‌ను వేశారు. డాక్టర్ రమేష్, నర్సుబాయి, రాధ, దేవి, తిరుపతి, బీమ్‌రాజ్, గోకుల్, నాగు, రఘు, సూరి, రవియాదవ్ తదితరులున్నారు.

చర్చి సమస్యను పరిష్కరించాలని మంత్రి తలసానికి వినతి

చిక్కడపల్లి: హైకోర్టు ఉత్తర్వులను ధిక్కరించి చర్చిని నిర్వహిస్తున్న వీరాచారి వర్గాన్ని తప్పించి దైవజనులు భక్తసింగ్ నిజమైన అను చరులైన ట్రస్ట్ సభ్యులకు చర్చి బాధ్యతను అప్పగించాలని కోరుతూ నగర ఇన్‌చార్జి మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు భారత క్రిస్టియన్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు బిషప్ భాస్కర్, క్రైస్తవ ప్రచార పరిరక్షణ సమితి నిర్వాహకులు జెరుషలేము ముత్తయ్యలు కోరారు. ఈ మేరకు మంత్రిని బుధవారం కలసి వినతిపత్రాన్ని అందజేశారు. గత నెల 23న హైకోర్టు తీర్పు ఎఫ్‌సీఎస్ పీటర్ ఆధ్వర్యంలోని హెబ్రోన్ ట్రస్ట్ వారికి అనుకూలంగా వచ్చిందన్నారు. అని వార్య కారణాలవల్ల పోలీసులు, కొందరు రాజకీయ నాయకులు సహకరించకపోవడంతో చట్ట ప్రకారం హెబ్రోన్ చర్చి నిర్వహణను పీటర్ వర్గం చేపట్టలేకపోతోందన్నారు. గత కొన్నేళ్లుగా చర్చిలో అక్రమంగా ఉంటున్న రాగి వీరాచారి, కురియన్ తదితరులు తమ అనధికార సొసైటీ పేరుతో చర్చిలో తిష్టవేసి పలు అక్రమాలు, ఆర్థిక నేరాలు మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

- గత నెల 25న క్రిస్మస్ రోజున పీటర్ ట్రస్ట్‌కు సంబంధించిన పాస్టర్లు పి.ఇమ్మాన్యుయేలను బయటకు గెంటివేశారని వాపోయారు. హెబ్రోన్ చర్చి కేంద్ర కార్యాలయం అందులోని అడ్మినిస్ట్రేషన్ ఆర్థిక, సామాజిక ఆస్తులు, చర్చి ప్రార్థనలు, సిబ్బంది నిర్వహణ తదితర వ్యవహారాలపై పీటర్ బృందానికి పూర్తి అధికారాలు, సర్వహక్కులు కోర్టు ఆదేశాల ప్రకారం ఉన్నాయన్నారు.
- కోర్టు కాపీలు, ట్రస్ట్ అధికారి గుర్తింపు కాపీలు అన్ని ఆధారాలు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు అందజేశామన్నారు. సీఎం, గవర్నర్‌ల దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లి శాంతియుతంగా ఆందోళన చేపట్టి భక్తసింగ్ పవిత్ర ఆశయాలను కొనసాగేలా కృషి చేస్తామన్నారు.